తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

నిజం.. నిర్భయంగా

హైదరాబాద్ | పేజీలు 8 | /aksharagalam.com | శనివారం, మార్చి 7, 2026 | సంపుటి : 14 సంచిక :10 వెల : 3/-

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రబెల్లి స్వర్ణకు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్‌గా సేవలు అందించారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా గతంలో బాధ్యతలు నిర్వర్తించారు. ఎర్రబెల్లి స్వర్ణను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యుద్ధ జ్వాలలు

- లెబనాన్‌లో హెజ్బొల్లా స్థావరాలపై బాంబుల వర్షం
- ఇరాన్ డ్రోన్ వాహక నౌకపై అమెరికా దాడి
- ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- లొంగిపోవాలని అమెరికా హెచ్చరికలు
- ప్రాంతమంతా ఉద్రిక్త పరిస్థితులు

## టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధవిమానాల దాడులు





పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తిని బలహీనపరచాలనే ఉద్దేశంతో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులను కొనసాగిస్తున్నాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడులను తీవ్రతరం చేస్తోంది. దీంతో మొత్తం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం ఏడో రోజుకు చేరిన నేపథ్యంలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై భారీ దాడులకు దిగాయి. సుప్రీం నాయకుడి నివాస సముదాయంలో నిర్మించిన భూగర్భ బంకర్‌ను లక్ష్యంగా చేసుకొని బాంబులు విసిరినట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో నాయకత్వాన్ని రక్షించేందుకు నిర్మించిన ఈ బంకర్‌లో కీలక సమావేశాల కోసం ప్రత్యేక గదులు ఉన్నాయని పేర్కొంది. దాడుల సమయంలో టెహ్రాన్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్

ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్

యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ





## ప్రపంచానికి పోటీగా హైదరాబాద్

- అంతర్జాతీయ ప్రమాణాలతో నగర అభివృద్ధి పనులు వేగం
- ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మారనున్న హైదరాబాద్
- కొత్వాల్‌గూడ ఎకోహిల్ పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన
- భవిష్యత్తు నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికలు
- మూసీ ప్రక్షాళనతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ

హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హైదరాబాద్ వైపు దృష్టి సారిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు నగరానికి రానున్నాయని,

(మిగతా 2వ పేజీలో)

## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం.. 140కు పైగా విమానాల రద్దు



దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల్లో అంతర్జాతీయ సర్వీసుల నిలిపివేత

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

::: సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

- 90 రోజుల్లోగా చర్యలు చేపడతామన్న సీఎం చంద్రబాబు
- 13 నుంచి 16 ఏళ్ల వయసు వారిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడి
- జాతీయ స్థాయిలోనూ పాలసీ తేవాలని కోరిన టీడీపీ

సోషల్ మీడియా వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడుతూ ఆయన ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. రాబోయే 90 రోజుల్లోగా దీనికి సంబంధించి కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక 13 నుంచి 16 ఏళ్ల వయసున్న పిల్లల విషయంలో ఎటువంటి ఆంక్షలు విధించాలనే దానిపై ప్రభుత్వం చర్చిస్తోందని చంద్రబాబు తెలిపారు. దీనిపై అందరితో చర్చించి, ఏకాభిప్రాయం కుదిరిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. యాదృచ్ఛికంగా, కర్ణాటకలోనూ 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను నిషేధిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఇదే రోజు ప్రకటించడం గమనార్హం. పాఠశాల విద్యార్థులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చట్టం తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని గత నెలలో హోంమంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీకి తెలిపారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే



రెండుసార్లు భేటీ అయ్యి, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించింది. సోషల్ మీడియా మితిమీరిన వినియోగం వల్ల పిల్లల ఏకాగ్రత దెబ్బతింటోందని, వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందని

(మిగతా 2వ పేజీలో)



## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు: హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్‌రావు విమర్శలు




## ఏప్రిల్ నుంచి ఓటర్ల జాబితా మహా ప్రక్షాళన

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎన్నికల యంత్రాంగం

## సివిల్స్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

- సివిల్స్ తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ
- తెలుగు రాష్ట్రాల్లో టాప్‌గా నిలిచిన జీను శ్రీజశ్వంత్‌చంద్ర
- తెలంగాణలో మొదటి స్థానంలో పెద్దపల్లి యువతి సృజన
- జోధ్‌పూర్ వైద్యుడు అనూజ్ అగ్నిహోత్రికి తొలి ర్యాంక్
- చెన్నైకి చెందిన రాజేశ్వరి సువేకు రెండో స్థానం
- ఢిల్లీ అభ్యర్థి ఆకాంక్ష్ ధుల్‌కు మూడో ర్యాంక్







హైదరాబాద్: సివిల్స్2025 తుది ఫలితాలను యూపీఎస్సీ ప్రకటించింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన జీను శ్రీజశ్వంత్‌చంద్ర ఆలిండియా 23వ ర్యాంక్ సాధించి తెలుగు రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిచారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాకు చెందిన గూడెల్లి సృజన 55వ ర్యాంక్ సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ ఫలితం సాధించారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పరీక్షగా

(మిగతా 2వ పేజీలో)

# యుద్ధజ్వాలలు



దుబాయ్: ఇరాన్‌లోని కర్మన్షా నగరంలో కూడా పేలుళ్లు చోటుచేసుకున్నట్లు సమాచారం. అక్కడ క్షిపణి నిల్వలు, ప్రయోగ స్థావరాలు ఉన్నాయని విదేశీ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇదే సమయంలో లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు మరింత ఉధృతమయ్యాయి. హెజ్బొల్లా మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకొని బీరుట్ శివార్లతో పాటు పలు ప్రాంతాల్లో బాంబులు కురిపించింది. ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో బీరుట్ పరిసర ప్రాంతాలు, దక్షిణ లెబనాన్ నుంచి వేలాదిమంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. బీరుట్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం సమీపంలో కూడా పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. సముద్ర ప్రాంతాల్లో కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌కు చెందిన డ్రోన్ వాహక నౌకపై అమెరికా దాడి చేసినట్లు అమెరికా సైనిక వర్గాలు ప్రకటించాయి. భారీ పరిమాణంలో ఉన్న ఈ నౌకపై డ్రోన్ల ప్రయోగం కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దాడి తరువాత నౌక మంటల్లో చిక్కుకున్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. భూగర్భ లక్ష్యాలను ధ్వంసం చేయడానికి బలమైన బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా తెలిపింది. ఇదిలా ఉండగా ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు ఉన్న దేశాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించినట్లు సమాచారం. కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ ప్రాంతాలపైకి ఈ దాడులు జరిగినట్లు విదేశీ మీడియా వెల్లడించింది. ఖతర్‌లోని ఒక వైమానిక స్థావరంపైకి వచ్చిన డ్రోన్‌ను అక్కడి రక్షణ బలగాలు కూల్చివేశాయి. అలాగే సౌదీ అరేబియాలోని ఒక సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని వచ్చిన క్షిపణులను కూడా అడ్డుకున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ రెండు దఫాలుగా క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. టెల్ అవీవ్ నగరంలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దీంతో ఆ దేశంలో అప్రమత్త పరిస్థితులు నెలకొన్నాయి. పౌరులు భద్రతా బంకర్లలోకి వెళ్లాలని అధికారులు సూచించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరించారు. ఇరాన్ తన ఆయుధ కార్యక్రమాలను నిలిపివేయాలని, యుద్ధానికి ముగింపు పలకాలని పేర్కొన్నారు. ఇరాన్ లొంగిపోతే ఆ దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఇరాన్‌లో ప్రజలకు ఆమోదయోగ్యమైన కొత్త నాయకత్వం ఏర్పడిన తరువాత దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా యుద్ధం కారణంగా మానవీయ పరిస్థితులు మరింత విషమిస్తున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న ఈ ఘర్షణల్లో చిన్నారులు కూడా పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో చిన్నారుల మరణాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రాంతమంతటా యుద్ధ వాతావరణం కొనసాగుతుండటంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభమైనప్పటికీ యుద్ధానికి తక్షణ ముగింపు కనిపించడంలేదు. దీంతో పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతున్నాయి.

# ప్రపంచానికి పోటీగా హైదరాబాద్

ప్రపంచంతో పోటీపడే మహానగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజాపాలనప్రగతి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ నిర్మించిన కొత్వాల్‌గూడ ఎకోహిల్ పార్కును ఆయన ప్రారంభించారు. అలాగే బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, భవిష్యత్‌లో హైదరాబాద్ అభివృద్ధి వేగంగా సాగుతుందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ప్రాంతీయ వలయ రహదారి, మూసీ నది తీర అభివృద్ధి, శంషాబాద్ వేగవంతమైన రైలు కేంద్రం, బుద్వేల్ ట్రంపెట్, ఎకో పార్కు వంటి ప్రాజెక్టులు నగర రూపురేఖలను పూర్తిగా మార్చ నున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రముఖ నగరంగా ఎదిగిందని, రాను న్న రోజుల్లో ప్రపంచ స్థాయి నగరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో కూడా హైదరా బాద్ అభివృద్ధికి పలు ముఖ్యమైన పనులు జరిగాయని సీఎం గుర్తు చేశారు. హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాలు నగర అభివృద్ధికి దోహ దపడ్డాయని చెప్పారు. కృష్ణా, గోదావరి నదుల నీటిని నగరానికి తీసుకొచ్చి తాగునీటి సమ స్యను తగ్గించారని వివరించారు. మూసీ వరదల నుంచి రక్షణ కోసం హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ చెరువులు నిర్మించబడినట్టు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి, గోల్కొండ కోట, అసెంబ్లీ భవనం వంటి చారిత్రక కట్టడాలు హైదరాబాద్ ప్రత్యేకతను తెలియజేస్తాయని పేర్కొ న్నారు. ఇంత అందమైన నగరం కాలక్రమేణా ఆక్రమణలు, చెత్త సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని సీఎం అన్నారు. నగరాన్ని మళ్లీ శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి అందమైన తీర ప్రాంతంగా మార్చుతామని తెలిపారు. గంగా, యమున నదుల తరహాలో మూసీ నదిని కూడా శుభ్రపరిచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నగర అభివృద్ధి కోసం చేపడు తున్న ప్రాజెక్టుల వల్ల భూములు కోల్పోయే వారికి తగిన పరిహారం అందజేస్తామని సీఎం హా మీ ఇచ్చారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, రేడియల్ రహదారులు వంటి పనులు నగర రవాణాను మెరుగుపరుస్తాయని తెలిపారు. భూములు ఇచ్చే రైతులు, ప్రజలకు నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్పారు. వారికి ఉత్తమ పరిహారం అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ ప్రాజెక్టు వివరాలను అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సుమారు నాలుగు వందల ఎనభై ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఇది ఔటర్ రింగ్ రహదారిని రేడియల్ రహదారిరెండుతో అనుసంధానం చేస్తుంది. మొత్తం లూపులు, ర్యాంపులు కలిపి పదిహేను కిలోమీటర్లకు పైగా నిర్మాణం ఉండనుంది. అదనంగా సేవా రహదారి కూడా అందుబాటులోకి రానుంది. భూమి నుంచి ఇరవై ఆరు మీటర్ల ఎత్తులో నిర్మాణం ఉండటంతో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. కొత్వాల్‌గూడ ఎకోహిల్ పార్కు కూడా నగరానికి కొత్త ఆకర్షణగా నిలవనుంది. హిమాయత్‌సాగర్ సమీపంలో ఎనభై ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును అభివృద్ధి చేశారు. దాదాపు పది లక్షల మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచారు. ఈ పార్కు నగరానికి పచ్చని ఊపిరితిత్తుల్లా మారనుందని అధికారులు తెలిపారు. దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పార్కులో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద పక్షుల నిలయం ఏర్పాటు చేశారు. వేలాది పక్షులకు నివాసంగా ఈ ఏర్పాట్లు చేశారు. అలాగే ఎత్తైన మార్గం, బహిరంగ వేదిక, సీతాకోక చిలుకల తోట, సెన్సరీ పార్కు, పిల్లల కోసం సహజ ఆట స్థలం వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పార్కును సందర్శించే వారికి విదేశీ నగరాల్లో ఉన్న పార్కుల అనుభూతి కలుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పార్కును ప్రారంభించిన అనంతరం ఆయన అందులో కొంతసేపు తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు.

# ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు: హరీశ్

**కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్ రావు విమర్శలు**

**గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయని వెల్లడి**

**రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను నడిరోడ్డుపైకి తెచ్చారని ఆగ్రహం**

**పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పాకులాడుతున్నారని మండిపాటు**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుద్ధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# ఏప్రిల్ నుంచి ఓటర్ల జాబితా మహా ప్రక్షాళన

**రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ**
**ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎన్నికల యంత్రాంగం**




హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఏప్రిల్ నెల నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఈ నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితాను పూర్తిగా దోషరహితంగా మార్చడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు. సాధారణంగా జరిగే ఓటర్ల సవరణతో పోలిస్తే ఇది విస్తృత స్థాయిలో జరుగుతుంది. బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తారు. ప్రతి ఓటరు పేరు, చిరునామా, ఫొటో తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాను సరిచేస్తారు. ఈ ప్రక్రియలో మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకే వ్యక్తికి ఉన్న డూప్లికేట్ ఓట్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు జాబితా నుంచి తొలగిస్తారు. అదే సమయంలో కొత్తగా పదెనిమిదేళ్లు నిండిన యువతకు ఓటు హక్కు నమోదు చేస్తారు. ఇంటింటి సర్వే ద్వారా ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, క్షేత్రస్థాయి మ్యాపింగ్ పనులు, అవగాహన కార్యక్రమాలు వంటి ఏర్పాట్లు వెంటనే ప్రారంభించాలని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రజల్లో అవగాహన పెంచి సవరణ ప్రక్రియలో అందరూ సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. దేశవ్యాప్తంగా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దశలవారీగా కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో తొలి దశ పూర్తికాగా పలు రాష్ట్రాల్లో రెండో దశ కొనసాగుతోంది. తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఏప్రిల్ నుంచి మూడో దశ ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఓటర్ల జాబితా మరింత ఖచ్చితంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో తప్పులు, గందరగోళాలు లేకుండా పారదర్శక వ్యవస్థ ఉండేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్ తాజా వ్యాఖ్యలు

**ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్**

**యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ**

**ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'**

**హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసిన అమెరికా**

**యుద్ధం దెబ్బకు 90 డాలర్లకు చేరిన ముడిచమురు ధరలు**

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

ఐటీ మంత్రి నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి అంతర్జాతీయ విధానాలను పరిశీలించేందుకు మెటా, గూగుల్, ఎక్స్ వంటి దిగ్గజ సంస్థలతో చర్చలు జరపనున్నట్లు లోకేష్ గతంలోనే తెలిపారు. మహిళలు, పిల్లలకు సోషల్ మీడియాను సురక్షితమైన వేదికగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. మరోవైపు, వయసు ఆధారంగా సోషల్ మీడియా నియంత్రణపై జాతీయ విధానం తేవాలని కోరుతూ టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇటీవల కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ముంబై విమానాశ్రయంలోనే అత్యధికంగా 73 విమానాల రద్దు

**బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతాలో కూడా పలుసర్వీసులు నిలిపివేత**

న్యూఢిల్లీ/ముంబై: పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం భారతదేశ విమాన రవాణాపై కూడా పడింది. భద్రతా కారణాలతో శు క్రవారం దేశంలోని ప్రధాన నగరాల విమానాశ్రయాల్లో అంతర్జాతీయ విమాన సర్వీసులు భారీగా రద్దయ్యాయి. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో కలిపి మొత్తం 142 విమాన సర్వీసులు నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ముంబై విమానాశ్రయంలోనే అత్యధికంగా 73 సర్వీసులు రద్దయ్యాయి. బెంగళూరులో 33 విమానాలు, ఢిల్లీలో 29 సర్వీసులు, కోల్‌కతాలో 7 విమానాలు నిలిపివేయబడ్డాయి. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు కొంతకాలం ఈ ప్రభావం కొనసాగవచ్చని విమానయాన వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా విదేశాల్లో చిక్కుకుపోయిన ప్రయాణికులను స్వదేశానికి తీసుకురావడానికి కొన్ని విమానయాన సంస్థలు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాయి. స్పైస్‌జెట్ సంస్థ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులను తరలించేందుకు 14 ప్రత్యేక విమానాలను నడుపుతోంది. ఇక ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు జెడ్డా, మస్కట్ మార్గాల్లో తమ సర్వీసులను మళ్లీ ప్రారంభించాయి. ఆకాశ ఎయిర్ సంస్థ కూడా జెడ్డాకు పరిమిత సంఖ్యలో విమానాలను నడుపుతున్నట్లు తెలిపింది. శనివారం ముంబై, అహ్మదాబాద్, కొచ్చి నగరాల నుంచి జెడ్డాకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఇదే సమయంలో అహ్మదాబాద్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో అభిమానుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో విమానయాన సంస్థలు అదనపు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై నగరాల నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక విమానాలను నడపనుంది. అలాగే ఆకాశ ఎయిర్ సంస్థ కూడా ఆదివారం, సోమవారం రోజుల్లో ముంబై నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. ప్రస్తుతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు ముందుగా తమ విమానాల వివరాలు తెలుసుకుని ప్రయాణం చేయాలని విమానాశ్రయ అధికారులు సూచిస్తున్నారు.

## సివిల్స్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

భావించబడుతుంది. ప్రతి ఏడాది లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. కఠినమైన ఎంపిక ప్రక్రియలో మెయిన్స్, ఇంటర్వ్యూ దశలను విజయవంతంగా పూర్తి చేసిన వారిని తుది జాబితాలో ఎంపిక చేస్తారు. ఈ ఏడాది ఫలితాల్లో కూడా తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించడం విశేషంగా నిలిచింది. తెలంగాణకు చెందిన గూడెల్లి సృజన 55వ ర్యాంక్ సాధించడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె పెద్దపల్లి జిల్లాకు చెందినవారు. క్రమశిక్షణతో చేసిన సిద్ధత, పట్టుదలతో చేసిన కృషి ఫలితంగా ఈ విజయాన్ని అందుకున్నారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది పరీక్షలో జోధ్‌పూర్‌కు చెందిన ఎంబీబీఎస్ వైద్యుడు అనూజ్ అగ్నిహోత్రి ఆలిండియా మొదటి ర్యాంక్‌ను సాధించారు. చెన్నైకు చెందిన రాజేశ్వరి సువే రెండో ర్యాంక్ సాధించగా ఢిల్లీకి చెందిన ఆకాంక్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు కూడా మంచి ప్రతిభ కనబరిచారు. రాష్ట్రానికి చెందిన ఇరవై మందికి పైగా అభ్యర్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించడం గమనార్హం. ఈ ఫలితాలు యువతలో సివిల్ సర్వీసులపై ఆసక్తిని మరింత పెంచేలా ఉన్నాయి. కఠినమైన పోటీ మధ్య తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు సాధించిన విజయాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పట్టుదలతో కృషి చేస్తే ఎలాంటి పరీక్షనైనా జయించవచ్చని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి.

# యాంటీ డ్రక్స్ పైన విద్యార్థులకు అవగాహన



**కాప్రా, మార్చి 06,(నవజ్యోతి ప్రతినిధి) :** యాంటీ డ్రక్స్ పైన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కాప్రా పరిధిలోని విజయ హై స్కూల్ లో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం మేడ్చల్ - మల్కాజిగిరి, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు,సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు.చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు.యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు పడితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు.విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# జన ఔషధి పథకం ఆరోగ్య రంగంలో ఒక విప్లవం

**::: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**కీసర, మార్చి 06,(అక్షర గళం) :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జన ఔషధి పథకం ఆరోగ్య రంగంలో ఒక విప్లవాత్మక నిర్ణయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పిల్లి సాయి రామ్ పిలుపు మేరకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాధారణ ప్రజలు ఎక్కువ ఖర్చుతో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండగా, ఇప్పుడు అదే నాణ్యత కలిగిన ఔషధాలు 50% నుండి 90% వరకు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం గొప్ప విషయమని తెలిపారు.ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, వృద్ధులకు, పేద కుటుంబాలకు ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తమవుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా వేలాది జన ఔషధి కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని, ఆరోగ్య సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయడం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ధరలో నాణ్యమైన మందులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో మరిన్ని జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మాజీ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్,మాజీ వైస్ చైర్మన్ ఎన్.నరేంద్ర రెడ్డి,కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# గుండూర్ గ్రామంలో బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**కల్వకుర్తి మార్చ్6 (అక్షర గళం) :** కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామానికి చెందిన తుప్పలసత్యనారాయణఅనారోగ్యం తో చికిత్స అయిన ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సురభి వెంకటేశ్వరరావు సహకారంతో మంజూరు చేసిన 60 వేల రూపాయలు చెక్కును శుక్రవారం గుండూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బాధితుడికి చెక్కు అందజేయడం అందజేశారు. ఈ సందర్భంగా గుండూర్ గ్రామ ప్రజలు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా ప్రజలకు పని చేస్తున్నటువంటి గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎనుమల రేవంత్ రెడ్డి గారికి మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నంబి శంకర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వెంకటయ్య, పోతుగంటి రాజు, మాజీ సర్పంచ్ గోరటి వెంకటయ్య, ఎన్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, వార్డు మెంబర్లు పోతుగంటి అశోక్, మెంట జంగమ్మ లింగమయ్య, తుంగభద్ర వెంకటయ్య, పోతుగంటి పెద్ద నాగయ్య, కురుమ సంఘం అధ్యక్షులు మెంట భీమయ్య, కురుమ సంఘం నాయకులు నంబి వెంకటయ్య, తుంగభద్ర రాములు, మొగిలి రమేష్, మెంట వెంకటేష్, గడ్డ మల్లేష్, నంబి ఆంజనేయులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# కొత్తగూడెం రేడియోస్టేషన్‌లో కట్టెకోలకు సత్కారం



**అక్షర గళం , ఖమ్మం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. కొత్తగూడెం రేడియో స్టేషన్ డైరెక్టర్ కొలిపాక శంకర్రావు ఆధ్వర్యంలో ఖమ్మం భద్రాది కొత్తగూడెం జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల చేత శుక్రవారం పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. వ్యాఖ్యాతగా కట్టా రామకృష్ణ వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య అమానవీయ యుద్ధాలు అనే శీర్షికన రచించిన కవితను ఆలపించారు. ప్రపంచంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ కవిత సమాజానికి అద్దం పట్టిందని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శంకర్రావుతో పాటు పలువురు నరసయ్యను అభినందించారు. అనంతరం కట్టెకోలను పూలు, పండ్లతో తువ్వాలు కప్పి ఘనంగా సత్కరించారు.



## పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించిన మున్సిపల్ కమిషనర్

**ఆమనగల్లు, మార్చి 06 (అక్షర గళం):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా (నేటి) బుధవారం నుంచి మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి థీమ్ అయిన "పరిశుభ్రత" కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశుభ్రతపై మున్సిపల్ ఛైర్మెన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి, కౌన్సిలర్లతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఛైర్మెన్ పత్యనాయక్ మాట్లాడుతూ.. పారదర్శక పాలనతో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఒక నిర్దిష్ట రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కౌన్సిలర్లు ఎనుమల్ల రమేష్, మొక్తల వెంకటయ్య, నిరంజన్, ఎంగలి భాగ్యమ్మ రఘు, కాలే యశోదమ్మ వీరయ్య మరియు మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆమనగల్లులో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

**ఆమనగల్లు, మార్చి 06 (అక్షర గళం):** ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కుసుమ మాధురి అధ్యక్షతన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేసి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ మాధవ రెడ్డి, ఏపీఎం నీరజ, అంగన్వాడి సూపర్వైజర్ అనిత, ఏఈ పిఆర్ అభిషేక్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ శరత్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, మండల విద్యాధికారి పాండు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైమున, టెక్నికల్ అసిస్టెంట్స్ దేవోజీ, జయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్, మండల ఆఫీస్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ కుమార్, సూపరింటెండెంట్ సుమలత, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్న, ఓఎస్ రమేష్, శ్రీకాంత్, హాఫిజా, పార్వతమ్మ మరియు ఆయా శాఖల అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధితో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలి

**::: డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**

**ఆమనగల్లు, మార్చి 06 (అక్షర గళం):** యువత స్వయం ఉపాధితో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ మండలంలోని మక్త మాదారం గ్రామానికి చెందిన దుర్గాని రమ్య నర్సింహా ఏర్పాటు చేసుకున్న కిరాణా జనరల్ స్టోర్ ను గంప వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వయంకృషితో ఎదగడం ఎంతో గొప్ప విషయమని అలా స్వయంకృషితో ఎదగాలని దృఢ నిశ్చయంతో రమ్య నర్సింహా ఏర్పాటు చేసుకున్న కిరాణా జనరల్ స్టోర్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వ్యాపారంలో ఉన్న మెలుకువలు పాటించి నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రమ్య నర్సింహా దంపతులను గంప వెంకటేష్ గుప్తా శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ బండి మంజుల చంద్రమౌళి, వార్డు సభ్యులు యాదగిరి, శ్రీకాంత్, గ్రామ యువకులు జంగయ్య, యాదగిరి, చందు, కిషన్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## జకినాలపల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**కల్వకుర్తి మార్చ్6 (అక్షర గళం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఊరుకొండ మండలం జకినాలపల్లిలో సర్పంచ్ కదిరి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామపంచాయతీలోపల గురుపయోగంగా ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలిరాజు, శ్రీశైలం, కల్పన, అర్జున్, గణేష్ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ముస్తఫా, ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఎక్సైజ్ దాడులు

## 600 కిలోల నల్ల బెల్లం సీజ్.. ఒక వ్యక్తికి రిమాండ్

### కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జె వెంకటరెడ్డి






కల్వకుర్తి మార్చ్6( అక్షర గళం) తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ హరికిషన్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ శాన్వాజ్ ఖాద్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని స్పెషల్ డ్రైవ్ మార్చ్ 5 నుండి 19 వరకు ఎక్సైజ్ శాఖ చేపట్టిందని కల్వకుర్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ జె వెంకటరెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయ్ భాస్కర్ రెడ్డి నాగర్ కర్నూలు జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి ఆదేశాల మేరకు కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలోని విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలోని వంగూరు మండలం తిరుమలగిరి తండాలో అక్రమంగా నాటు సారాయి తయారీ రవాణా నల్ల బెల్లం సరఫరా నిలువలపై విస్తృతంగా దాడుల జరిపి 600 కిలోల నల్ల బెల్లం నాలుగు లీటర్ల నాటు సరాయిని రెండు బైకులు స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసి కల్వకుర్తి సబ్ జైలుకు రిమాండ్ కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. అక్రమంగా నాటు సారాయి నల్ల బెల్లం విక్రయిస్తే సరఫరా చేసిన దీనితోపాటు గంజాయి డ్రగ్స్ ఎన్ డి పి మద్యంపై నిగా ఉంచి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ దాడుల్లో ఒకసారి పట్టుబడిన నేరస్తులను బైండోవర్ చేసి మళ్లీ నేరానికి పాల్పడితే లక్ష రూపాయల జరిమాన విధిస్తామని తెలిపారు. కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలోని పదేపదే నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ విస్తృత దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ సిఐ వెంకటేశ్వర్ రెడ్డి, జబ్బార్, ఎస్ ఐ నాగరాజు, ఎస్ ఐ వివేక్, సిబ్బంది జనార్ధన్ నార్య, పరశురాం జ్యోతి పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శం

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి








**కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం):** నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని దేశ స్వాతంత్రం కోసం యువతను ఉద్యమంలోనికి తీసుకువచ్చిన మహానేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకంగా నిలువాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు టాస్క్ సి ఓ ఓ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చు బావి సమీపంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 కార్యక్రమాలు పూర్తిచేసుకుని యువతకు స్ఫూర్తిగా నిలిచిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ కార్యక్రమానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ బాటలో యువత దేశాన్ని ప్రేమించి సమాజానికి సేవ చేయాలని మీరు నాకు రక్తం ఇస్తే నేను మీకు స్వాతంత్రం ఇస్తానని అంటూ దేశ స్వాతంత్రం కోసం యువతను ఉద్యమంలోకి తీసుకువచ్చిన మహానేత సుభాష్ చంద్రబోస్ పూర్తి మార్గదర్శకమని దేశ స్వాతంత్రం కోసం సిద్ధించిన పోరాట యోధుల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ అగ్రగన్యుడు అయ్యారని ఆయన ధైర్యసహసాలు త్యాగం దేశభక్తి భారత యువతకు ఎప్పటికీ పూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు నేతాజీ స్థాపించిన ఆజాద్ హిందూ ఫౌస్ ద్వారా దేశ స్వాతంత్ర పోరాటానికి కొత్త ఊపును ఇచ్చాయని ఆయన ఆశయాలు దేశ ప్రజల హృదయాలలో నిలిచాయని దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ నేతాజీ చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. మిత్ర ఫౌండేషన్ తమ ఫౌండేషన్ ద్వారా కల్వకుర్తి పట్టణ కేంద్రంలో సేవా కార్యక్రమాలు పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ 100 కార్యక్రమాలు పూర్తిచేసుకుని యువత స్ఫూర్తిగా నిలిచినందుకు అభినందించారు. మిత్ర ఫౌండేషన్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగించాలని కోరుకుంటున్నానని ఫౌండేషన్స్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ కుడుముల చంద్రకాంత్ రెడ్డి అధ్యక్షుడు కుక్కుడాల శ్రీకాంత్ నేత మిత్ర ఫౌండేషన్ సభ్యులు స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలని రిస్క్ వద్దు: వీడియో షేర్ చేసి సజ్జనార్



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వాలని, లైకుల కోసం యువత జీవితాన్ని రిస్క్ చేయవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హితవు పలికారు. ఒక యువకుడు వేగంగా కదులుతున్న రైలు నుంచి వేలాడుతూ రీల్ చేస్తుండగా స్తంభం ఢీకొట్టి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి, లైఫ్‌ను రిస్క్ చేసేవారిని హెచ్చరించారు. "సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలని తపన పడే వారికి ఇదో హెచ్చరిక. నడుస్తున్న రైలుకు వేలాడుతూ చేసే ఈ స్టంట్లు చూస్తుంటే ప్రాణం మీద తీపి కంటే ఫోన్లో వచ్చే లైకుల మీద ఆశ ఎక్కువైపోయినట్టుంది. ఇలాంటి తెలివితక్కువ పనుల వల్ల ఆ యువకుడికి దక్కింది ఏంటి? కేవలం ఆసుపత్రి బెడ్ లేదా అంతిమయాత్రే కదా. మీ పిచ్చి విన్యాసాలకు ప్రాణం పోయే వరకు ఆగుతారా? ఇంట్లో మీ కోసం ఎదురుచూసే వాళ్ల గురించి కనీసం ఒక్కసారైనా ఆలోచించారా? లైకుల కోసం లైఫ్ రిస్క్ చేసేంత పిచ్చి వద్దు. ప్రాణం పోయాక ఆ రీల్స్ ఎవరూ చూడరు. మీ కుటుంబం మాత్రం జీవితాంతం కన్నీళ్లు పెడుతుంది" అని హితవు పలికారు.



## మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోడెల లలిత గణేష్ యాదవ్‌కు సన్మానం

**కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందరోజుల కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సుభాష్ నగర్ గచ్చు బావి సమీపంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ కోడెల లలిత గణేష్ యాదవ్ ను మిత్ర ఫౌండేషన్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు.



## రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి , అధికార ప్రతినిధి డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేసి, వారి రాజకీయ ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి,కే ఏం గౌరీష్,బట్ట పాలకృష్ణ,గడ్డం రాజేందర్ రెడ్డి,మన్నే రాజు, లక్ష్మ రెడ్డి,మైసిగారి శ్రీనివాస్, రషీద్, ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆమనగల్లు, మార్చి 06 (అక్షర గళం): గర్భిణీలు బాలింతలు కిషోర బాలికలకు పోషకాహారం తప్పనిసరిగా అవసరమని గర్భిణులకు పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంపుగూడ అంగన్వాడీ కేంద్రాల్లోపోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న రాగి జావా, పల్లి పట్టి, నువ్వుల లడ్డు, చిరుధాన్యాలతో చేసిన లడ్డు, బెల్లంతో తయారు చేసిన పరమాన్నం. మునగాకు, కరివేపాకు కారంపొడి మొదలగు ఆహార పదార్థాలు ఎలా తయారు చేసుకుని తీసుకోవాలో వివరించారు. రక్తహీనతకు గురి కాకుండా ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చల్లా ప్రమీల కిరణ్, ఆశా వర్కర్లు మల్లేశ్వరి, బాలింతలు, గర్భిణి స్త్రీలు ప్రీతి, అనూష, మౌనిక, అంజలి, రాణి, శిరీష, పుష్పమ్మ తదితరులు ఉన్నారు.



## వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి మార్చి 6 (అక్షర గళం) తలకొండపల్లి మండలం పరిధిలోని గౌరిపల్లి తండాకు చెందిన సీనియర్ నాయకులు కేతావత్ రాజు నాయక్ కుమార్తె వివాహ వేడుకకు హాజరైనఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు & TASK – C.O.O సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉప సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ అంజి యాదవ్,వార్డు సభ్యులు వస్పుల సురేష్,భాస్కర్, స్థానిక సీనియర్ నాయకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి పట్టణంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహ ఆవిష్కరణ

**కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సుభాష్ నగర్ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో బిజెపి జాతీయ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి బిజెపి జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ బృంగి ఆనంద్ కుమార్ రత్నమాల కౌన్సిలర్లు మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కాలనీలో మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయం

## మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**అక్షర గళం, మియాపూర్ :** కాలనీలో మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సి సి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు, జిహెచ్ఎంసి అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రశాంత్ నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సి,సి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు, జిహెచ్ఎంసి అధికారులతో కలసి పరిశీలించామన్నారు., ప్రశాంత్ నగర్ కాలనీ ఆభివృద్దికి కృషి చేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, అధికారులకు కాంట్రాక్టర్ కు తెలియజేయడం జరిగినదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత,సుఖవంతమైన,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్లు డ్రైనేజి,మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, గౌరవ,రాజ చైర్మన్ ఎమ్మెల్యే శ్రీ ఆరెకపూడి గాంధీ గారి సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను పూర్తి చేసి ప్రజలకు విడతల వారిగా అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని తాజా మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్స్పెక్టర్లు జగదీష్,అన్వర్, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, కాలనీ వాసులు రవి,సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలి

## ::: తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**అక్షరగళం, రంగారెడ్డి:** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ల ఆధ్వర్యంలో ప్రధాన అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలని ఆయన తెలిపారు. జిల్లా ఇంచార్జి ఐటీ, పరిశ్రమల , వాణిజ్య శాఖ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో జవాబుదారీ తనంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమం అందని వారిని గుర్తించి నిర్లక్ష్యం వహించకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల పాటు చేపట్టే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లను కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా పనిచేస్తామని ఆయన తెలిపారు.ఈ అవగాహన సమావేశంలో శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నాగర్‌కర్నూల్ జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఆకస్మిక తనిఖీలు



కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం): ఆహార భద్రతా చట్టం అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ బృందం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించింది. ఈ పర్యటనలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యుడు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. బృందం వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, ఆస్పత్రులు మరియు రేషన్ గోదాంలను పరిశీలించింది. వెల్దండలోని ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వెల్దండ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషన్ బృందానికి పాఠశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులు తెలియజేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం లేదని గుర్తించారు. భోజనం నాణ్యతపై సిబ్బందిని ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన ఆఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్ వసతులను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆహార భద్రతా చట్టం అమలులో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని చైర్మన్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటామని కమిషన్ వెల్లడించింది. తరువాత కల్వకుర్తిలోని పాఠశాలలు, ఆసుపత్రి రేషన్ బియ్యం గోదాంలను కూడా కమిషన్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అనంతరం కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆహార భద్రత విషయంలో ఎప్పటికప్పుడు తనిఖీలలీ నిర్వహించాలని సంబంధిత అధికారులను చైర్మన్ ఆదేశించారు. కల్వకుర్తి మండలంలో ఆకస్మికంగా ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ సప్లై గోదాం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల తనిఖీ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి తహసిల్దార్ ఇబ్రహీం డి సి ఎస్ ఓ నరసింహారావు డీఎం సివిల్ సప్లై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేసి తనిఖీలు తెలిపిన విషయాలపై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.



## నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ కార్పొరేటర్

అక్షర గళం, శేరిలింగంపల్లి : శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆశనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మదన్ గోపాల్ నవీనా దంపతుల గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ. కార్యక్రమంలో ఏడుపాయల శ్రీనివాస్, దాతి రమేష్, నిరంజన్, సంగారెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలోని శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి బీసీ జాతీయ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి బిజెపి జిల్లా నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి ఆయా వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో బిజెపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## నూతన కార్ డెక్కర్స్ ప్రారంభోత్సవం

**కల్వకుర్తి మార్చ్ 6 (అక్షర గళం ):** నూతనంగా కార్ డెక్కర్స్ ప్రారంభోత్సవం పూజా కార్యక్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు బిజెపి జిల్లా నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి 13వ వార్డు కౌన్సిలర్ బోడ నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బిజెపి నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



## అల్లు శిరీష్ వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

ప్రముఖ టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రేయసి నయనికతో శిరీష్ వివాహం ఈ శుక్రవారం (మార్చి 6, 2026) సాయంత్రం కన్నుల పండుగగా జరిగింది. హైదరాబాద్‌లోని కొల్లూరు ఐనా ఈవెంట్ స్పేస్ వేదికగా జరిగిన ఈ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అల్లు శిరీష్, నయనిక జంటకు సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధూవరులు, అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో కలిసి సీఎం ఫోటోలు దిగారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అల్లు కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. గత నాలుగైదుళ్లుగా అల్లు శిరీష్, నయనిక ప్రేమించుకుంటున్నారు. ఫ్యామిలీ ఫంక్షన్లలో ఏర్పడిన వీరి పరిచయం ప్రేమగా మారి, నేడు పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలెక్కింది. కాగా, మూడు రోజుల క్రితమే వీరి ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన అనేకమంది ప్రముఖులు హాజరుకాగా.. నేడు జరిగిన పెళ్లిని మాత్రం అత్యంత ప్రైవేట్‌గా, సన్నిహితుల సమక్షంలో జరిపించడం విశేషం. ప్రస్తుతం అల్లు వారింట జరిగిన ఈ పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# హైదరాబాద్‌లో రూ.350 కోట్లతో లగ్జరీ హోటల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ--లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027--28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది. ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర?టని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్క్‌లు ఉన్నాయి.

# ఐటీ కొత్త రూల్: ఇంటి ఓనర్‌తో సంబంధం చెప్పాలి




ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారీన్ ట్యాక్స్ విత్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.



# కొంచెం రిస్క్ ఉన్నా.. లాభం రావాలంటే?

ఈక్విటీలలో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ అన్నవి కొంచెం రిస్క్ ఉన్నా సరే, రాబడులు కూడా బలంగా ఉండాలని కోరుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. ఇవి తాము ఎంపిక చేసుకున్న రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ మాత్రం భిన్నమైన, మెరుగైన పనితీరుతో ఆకర్షిస్తోంది. ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని వైవిధ్యం కోసం కేటాయించుకోవాలని భావించేట్టు అయితే.. ఈ ఫండ్‌ను పరిశీలించొచ్చు. పథకం 2021 జనవరిలో ప్రారంభమై.. ఐదేళ్ల ట్రాక్ రికార్డును పూర్తి చేసింది. ఈ పథకం ఆరంభంలో రూ.లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే అది రూ.2.51లక్షలుగా మారి ఉండేది. ఐదేళ్లలోనూ ఏటా 20.56 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇదే కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ రాబడి 15.47 శాతమే ఉండడం గమనార్హం. ఏడాది కాలంలో పెట్టుబడులపై 18 శాతం రాబడిని అందించింది. ఇక మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడి 22.82 శాతంగా ఉంది. ఇక ఇదే విభాగంలో ఇతర పథకాలతో పోలి?చితే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ట్రాక్ రికార్డు పటిష్టంగా ఉంది. ఇన్వెస్టర్లు కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10,000 చొప్పున సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.6.10 లక్షలు ఐదేళ్లలో రూ.9.74 లక్షలుగా మారి ఉండేది. అంటే ఏటా 18.47 కాంపౌండెడ్ రాబడి (సీఏజీఆర్)కి సమానం. బిజినెస్ సైకిల్స్ అంటే.. కొన్ని వ్యాపారాలకు ఒక్కో సమయంలో డిమాండ్ బలంగా ఉంటుంది. ప్రస్తుతం మెటల్స్‌లో బంగారం, వెండి, అల్యూమినియం, రాగి ధరలు గణనీయంగా పెరగడం, ఈ రంగాల్లోని కంపెనీలు బలంగా లాభాలు ఆర్జించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సైకిల్స్‌ను ఈ ఫండ్ ముందే గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. స్థూల ఆర్థిక పరిస్థితులకు (ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, వృద్ధి గమనం, ద్రవ్య పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు) అనుగుణంగా ప్రయోజనం పొందే రంగాలను, థీమ్యాటిక్ అవకాశాలను ముందే గుర్తించి, ఆయా రంగాల్లోని బలమైన కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. తద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడులను వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశం. పరిస్థితులకు అనుగుణంగా విదేశీ స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది.

# తగ్గిన దేశ వృద్ధిరేటు.. కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల

**అక్టోబర్-డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు**

**అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు**

**ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా**




న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022-23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011-12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

**ఇదీ సంగతి..**

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ-వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ-వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్-డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024-25) అక్టోబర్-డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

**ఈసారి 7.6 శాతం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025-26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2024-25లో రూ.299.89 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

వచ్చేసారి 7-7.4% : సీఈఏ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 7-7.4 శాతంగా ఉండొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే గత నెల జనవరిలో కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం ఈ అంచనా 6.8-7.2 శాతంగానే ఉన్నది. జీడీపీ గణనకు కొత్త సిరీస్ విడుదలైన నేపథ్యంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును కూడా దాటగలదన్న విశ్వాసాన్ని కొత్త సిరీస్ ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.

# జీసీసీలకు డిమాండ్ భళా



**గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు/జీసీసీలు) ఏర్పాటుకు అమెరికా కంపెనీలు భారత్‌ను ఎంతో కీలకంగా చూస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో 2020 నుంచి 2025 మధ్య హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో.. 101 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) కార్యాలయ వసతులను జీసీసీల ఏర్పాటుకు విదేశీ సంస్థలు లీజుకు తీసుకోవడం గమనార్హం. ఈ కాలంలో మొత్తం ఆఫీస్ లీజింగ్ 280.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు రియల్ ఎస్టేట్‌రంగ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తెలిపింది.**

బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబై, పుణె నగరాల డేటా ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నగరాల్లో మొత్తం ఉపాధి డిమాండ్‌లో 36 శాతం జీసీసీల నుంచే వస్తున్నట్టు తెలిపింది. గత ఐదేళ్లలో 101 మిలియన్ ఎస్ఎఫ్‌టీల జీసీసీల లీజింగ్‌లో 71 మిలియన్ ఎస్ఎఫ్‌టీని అమెరికా కంపెనీలు తీసుకున్నాయి.'భారత ఆఫీస్ మార్కెట్ ఇటీవలి సంవత్సరాల్లో పెద్ద ఎత్తున విస్తరించింది. కరోనా అనంతరం డిమాండ్ ఎప్పటికప్పుడు గరిష్టాలకు చేరుతోంది. ముఖ్యంగా జీసీసీలు ఈ విస్తరణకు చోదకంగా ఉన్నాయి. వ్యయాలు ఆదా చేసుకునే కేంద్రాలుగా కాకుండా.. ఆవిష్కరణల ఆధారిత అంతర్జాతీయ అనుసంధాన విజ్ఞాన, పరిశోధన కేంద్రాలుగా అవతరించాయి' అని కొలియర్స్ ఇండియా తెలిపింది.

**ఏటా 35--40 మిలియన్ ఎస్ఎఫ్‌టీ**

2025లో విదేశీ సంస్థలు భారత్‌లో 29.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీలను తీసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం గమనార్హం. ఈ ఏడు నగరాల్లో స్థూల ఆఫీస్ లీజింగ్ 71.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీలో ఈ మొత్తం 41 శాతంగా ఉంది. విదేశీ సంస్థలు భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఏటా 35--40 మిలియన్ ఎస్ఎఫ్‌టీని లీజుకు తీసుకుంటాయని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర?వసెస్ ఎండీ అరి?పత్ మెహరోత్రా అంచనా వేశారు. "యూఎస్ సంస్థల నుంచి టెక్నాలజీ ఆధారిత జీసీసీల ఏర్పాటు డిమాండ్ స్థిరపడొచ్చు. ఐరోపా సమాఖ్య, బ్రిటన్‌కు చెందిన సంస్థల నుంచి ఇంజనీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్‌కు సంబంధించి జీసీసీల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతుంది"అని చెప్పారు. ఈ నివేదికపై భివ్ వర్క్‌స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈవో సురేష్‌రావు పప్లికర్ స్పందిస్తూ.. భారత నైపుణ్యాలు, బిజినెస్ ఎకోసిస్టమ్ పట్ల అంతర్జాతీయ కంపెనీల్లో విశ్వాసానికి నిదర్శనమన్నారు. కోవర్కింగ్ సెంటర్లలో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను జీసీసీల కోసం తీసుకోవడం పెరిగినట్టు చెప్పారు. భారత్‌పై దీర్ఘకాల దృష్టితో యూఎస్, యూరప్, బ్రిటన్ కంపెనీలు జీసీసీల ఏర్పాటుకు ఆఫీస్ వసతులను లీజుకు తీసుకోవడం పెరిగినట్టు 'స్పేస్‌వన్' ప్రాపర్టీ యాక్విజిషన్ విభాగం డైరెక్టర్ సిజోజోస్ తెలిపారు.



# వినియోగంలో లేని ౭ పీఎఫ్ ఖాతాల్లో డిపాజిట్ల రిఫండ్

వినియోగంలో లేని (ఇనాపరేటివ్) దాదాపు ఏడు లక్షల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాల్లోని సుమారు రూ.30.52 కోట్ల మొత్తాన్ని రిఫండ్ చేయడంపై ఈపీఎఫ్‌వో దృష్టి పెడుతోంది. సదరు ఖాతాదారులు లేదా వారి లీగల్ వారసులకు త్వరలో బదిలీ చేయనున్నట్లు కార్మిక శాఖ వర్గాలు తెలిపాయి. రూ.1,000 వరకు బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాలను సెటిల్ చేయాలని కార్మిక, ఉపాధి శాఖ ఒక సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించాయి. ఉద్యోగి లేదా కంపెనీ నుంచి 36 నెలలకు పైగా ఎలాంటి జమ లేని పీఎఫ్ ఖాతాలను ఇనాపరేటివ్‌గా పరిగణిస్తారు. సంబంధిత వర్గాల ప్రకారం 31.86 లక్షల ఇనాపరేటివ్ ఖాతాల్లో మొత్తం రూ. 10,903 కోట్లు ఉన్నాయి. వాటిలో రూ. 1,000 లేదా అంతకన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లు ఏడు లక్షలు ఉన్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన ఈపీఎఫ్ ఖాతాలున్న వారి బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాలను తక్షణం బదిలీ చేయనున్నారు.

## రిటైల్ రుణాలు రూ.162 లక్షల కోట్లు

రిటైల్ రుణాలు గణనీయమైన వృద్ధిని చూస్తున్నాయి. 2025 డిసెంబర్ త్రైమాసికంలో 18 శాతం పెరిగి రూ.162 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా బంగారం ధరలు పెరగడంతో, వాటిపై రుణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండడం.. అలాగే, పండగల సీజన్, జీఎస్టీ రేట్ల తగ్గింపు రుణ వితరణ పెరిగేందుకు దారితీసింది. ఈ వివరాలను క్రెడిట్ సమాచార సంస్థ క్రిఫ్ హై మార్క్ విడుదల చేసింది. రిటైల్ రుణాల్లో అతిపెద్ద విభాగమైన గృహ రుణాలు 10.5 శాతం పెరిగి రూ.43 లక్షల కోట్లకు చేరాయి. ఈ విభాగంలో యాక్టివ్ రుణాలు నికరంగా 3.3 లక్షలు పెరిగాయి. వ్యక్తిగత రుణాలు సైతం 11.6 శాతం వృద్ధితో రూ.15.9 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆటో రుణాలు 14.6 శాతం, ద్విచక్ర వాహన రుణాలు 12.3 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ రుణాలు 14.3 శాతం చొప్పున పెరిగాయి. సోల్ ప్రొప్రైటర్ సంస్థలు (ఒక్కరే యజమానిగా ఉన్న) తీసుకున్న రుణాలు 26.2 శాతం పెరిగాయి. రిటైల్ రుణాల వసూలు కూడా మెరుగుపడింది. 30 నుంచి 180 రోజుల వరకు చెల్లింపుల్లేనివి (మొండి బకాయిలు) డిసెంబర్ చివరికి 2.8 శాతానికి తగ్గాయి.

# పొట్టులోనే పుట్టెడు

వేసవితోపాటే తాటి ముంజల సీజన్ కూడా వచ్చేస్తుంది. మండే ఎండల నుంచి.. ఈ ఐస్ ఆపిల్ ఎన్నోరకాలుగా ఉపశమనం కలిగిస్తుంది. అయితే, చాలామంది తాటి ముంజల పైన ఉండే పొట్టును పక్కన పడేస్తుంటారు. కానీ, అందులోనే అసలైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తాటి ముంజలపైన లేత పసుపు రంగులో ఉండే పల్చని పొట్టులో.. ఫైటోకెమికల్స్, ఫ్లేవనాయిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి.. కణాల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పొట్టులో అధిక శాతం లభించే పీచు పదార్థం.. జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. పేగుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. వేసవిలో వచ్చే మలబద్ధకాన్నీ నివారిస్తుంది. ఇక తాటి ముంజలు శరీరానికి ఎంత చలువ చేస్తాయో.. పైన ఉండే పొట్టుకూడా అంతే స్థాయిలో శరీర వేడిని తగ్గిస్తుంది. ఎండ వల్ల వచ్చే కడుపులో మంట, ఎసిడిటీ నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. వేసవిలో చెమటకాయలు, ఎర్రటి దద్దుర్లు లాంటివి పలకరిస్తాయి. ఈ చర్మ సమస్యలకు తాటి ముంజలపై ఉండే పొట్టుతో చెక్ పెట్టొచ్చు. ఈ పొట్టుతో నేరుగా చర్మంపై రుద్దడం వల్ల.. దురద, చెమటకాయలు తగ్గుతాయి. అయితే, ముంజలు లేతగా ఉన్నప్పుడే ఈ పొట్టు మృదువుగా, రుచిగా ఉంటుంది. ముంజలు ముదిరిపోతే.. పొట్టు కూడా వగరుగా మారుతుంది. జీర్ణం అవ్వడానికి సమయం పడుతుంది. కాబట్టి, లేత ముంజలపై ఉండే పొట్టును తినడమే మంచిది.






# స్లీప్ అప్నియాతో ఎన్నో సమస్యలు

స్లీప్ అప్నియా.. రక్తనాళాల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందట. గురక, నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం వల్ల.. వాస్కులర్ ఏజింగ్ సమస్య వచ్చే అవకాశం కూడా ఉన్నదట. తాజాగా, 20 దేశాలలోని 29,653 మంది పెద్దల డేటాను విశ్లేషించిన పరిశోధకులు.. ఈ విషయాన్ని బయటపెట్టారు. స్లీప్ అప్నియా–వాస్కులర్ ఏజింగ్ మధ్యగల సంబంధం గురించిన వివరాలను వెల్లడించారు. నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం వల్ల శరీరంలో కొన్ని ప్రతికూల మార్పులు జరుగుతాయట. రక్తంలో ఆక్సిజన్ స్థాయులు అకస్మాత్తుగా పడిపోవడం, పెరగడం వల్ల 'ఆక్సిడేటివ్ స్ట్రెస్' పెరుగుతుంది. ఇది రక్తనాళాల లోపలి పొరను దెబ్బతీస్తుంది. ఇక శ్వాస ఆగిపోయిన ప్రతిసారీ రక్తపోటు అకస్మాత్తుగా ఎక్కువ అవుతుంది. దీనివల్ల రక్తనాళాల గోడలు గట్టిగా మారుతాయి. అంతేకాకుండా, స్లీప్ అప్నియా వల్ల శరీరంలో సీ–రియాక్టివ్ ప్రొటీన్ లాంటి ఇన్‌ఫ్లమేటరీ కారకాలు పెరుగుతాయి. ఇవి రక్తనాళాల వృద్ధాప్యానికి దారితీస్తాయి. దీర్ఘకాలంలో, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అవి మూసుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా, రక్తనాళాల పనితీరు తగ్గి.. గుండె జబ్బులు వచ్చే అవకాశం పెరుగుతుంది. మెదడుకు వెళ్లే రక్తనాళాలు దెబ్బతినడం వల్ల ఆలోచనా శక్తిపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి, వాస్కులర్ ఏజింగ్‌ను అరికట్టడానికి స్లీప్ అప్నియా నుంచి బయటపడాలని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గడం వల్ల స్లీప్ అప్నియా తీవ్రత గణనీయంగా తగ్గుతుందట, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తనాళాల స్థితిస్థాపకత పెరుగుతుంది. యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవడం ద్వారా.. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించవచ్చు. తద్వారా రక్తపోటు, గుండెపోటు లాంటి సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

# ఫటాఫట్ బ్రేక్‌ఫాస్ట్



ఉరుకులు పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద పొరపాటు బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం. రాత్రంతా ఖాళీ కడుపుతో ఉన్న మన శరీరానికి ఉదయం పూట సరైన పోషకాలు అందడం ఎంతో అవసరం. ముఖ్యంగా ప్రొటీన్ అధికంగా ఉండే అల్పాహారం తీసుకోవడం వల్ల కండరాల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, రోజంతా ఉత్సాహంగా పని చేయడానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. కానీ, బ్రేక్‌ఫాస్ట్ తయారీకి టైమ్ వేస్ట్ అని చాలామంది బ్రంచ్‌కు మొగ్గు చూపుతున్నారు. కానీ, పదకొండు కొట్టే దాకా కడుపు మాడ్చుకోవం సరికాదని ఆహార నిపుణులు అంటున్నారు. అల్పాహారం తయారీకి సమయం వృథా అనే కదా మీ బాధ! ఈ వెరైటీలు ఫటాఫట్ చేసుకోవచ్చు. ప్రొటీన్ కంటెంట్ ఎక్కువగా ఉండే ఈ పదార్థాలను బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే.. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.

**పనీర్ బుర్జీ:** పనీర్ ప్రొటీన్‌కు నిలయం. ఇది చాలా త్వరగా జీర్ణం కావడమే కాకుండా రుచిగా కూడా ఉంటుంది. ఒక కప్పు తురిమిన పనీర్, ఒక చిన్న టమాటా, పచ్చిమిర్చి, పసుపు, ఉప్పు, కొద్దిగా నూనె లేదా నెయ్యి సిద్ధం చేసుకోవాలి. పాన్‌లో కొద్దిగా నూనె వేసి పోపు దినుసులు వేసి, తర్వాత టమాటాలు వేసి మగ్గనివ్వాలి. అందులో పసుపు, పచ్చిమిర్చి వేసి, తురిమిన పనీర్, ఉప్పు కలపాలి. 3–4 నిమిషాల పాటు వేయిస్తే పనీర్ బుర్జీ సిద్ధమవుతుంది.

**గ్రీక్ యోగర్ట్–నట్స్ బౌల్:** వంట చేసే సమయం కూడా లేని వారికి ఇది బెస్ట్ ఆప్షన్. ఇది కేవలం ఐదు నిమిషాల్లోనే సిద్ధం చేసుకోవచ్చు. 1 కప్పు గ్రీక్ యోగర్ట్ (పెరుగు), బాదం పప్పులు, చియా విత్తనాలు, ఒక అరటిపండు, కొద్దిగా తేనె ఉంటే చాలు ఈ వెరైటీ రెడీ చేసుకోవచ్చు. ఒక గిన్నెలో పెరుగు తీసుకుని, పైన అరటిపండు ముకలు, బాదం, చియా విత్తనాలు వేసి చివర్లో కాస్త తేనే కలుపుకొంటే చాలు. చిటికెలో బ్రేక్‌ఫాస్ట్ సిద్ధంగా ఉంటుంది.

**శనగపిండి అట్లు:** శాకాహారులకు శనగపిండి ఒక అద్భుతమైన ప్రొటీన్ వనరు. ఒక కప్పు శనగ పిండి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, పసుపు, నీరు పక్కన పెట్టుకోండి. శనగపిండిని గంట జారుడుగా కలుపుకొని అందులో ఉల్లిపాయలు, మిర్చి, పసుపు మిక్స్ చేసకోండి. పెనంపై కొద్దిగా నూనె వేసి అట్లు పోసుకోవాలి. రెండు వైపులా ఎర్రగా కాల్చుకుంటే పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ రెడీ.

**మొలకలు–ఉడికించిన గుడ్డు:** ఒక కప్పు మొలకెత్తిన గింజలు, రెండు ఉడికించిన గుడ్లు, నిమ్మరసం, మిరియాల పొడి, ఉప్పుతో దీనిని చేసుకోవచ్చు. ఒక గిన్నెలో మొలకలు తీసుకుని, నిమ్మరసం, ఉప్పు, మిరియాల పొడి కలపాలి. పైన ఉడికించిన గుడ్డు ముకలను పెట్టుకుని తింటే చాలాసేపటి వరకు ఆకలి వేయదు.

# ఏఐ గ్యాడ్జెట్స్‌తో ఆపిల్ అటాక్!

స్క్రీన్ వైపు చూడటం పాత పద్ధతి.. ఏఐతో మాట్లాడటం, చూడటం ఇప్పుడో కొత్త శకం! అందుకేనేమో స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని శాసించిన ఆపిల్.. ఇప్పుడు తన దృష్టిని పూర్తిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పైకి మళ్లించింది. కేవలం ఐఫోన్ సాఫ్ట్‌వేర్‌లోనే కాకుండా.. మన దైనందిన జీవితాన్ని మార్చేసే మూడు సరికొత్త ఏఐ గ్యాడ్జెట్స్‌ను త్వరలోనే లాంచ్ చేయబోతున్నట్లు లేటెస్ట్ లీక్స్ ద్వారా వెల్లడైంది. ఈ కొత్త పరికరాలు వస్తే మన ఇంటర్నెట్ వాడకం శైలే మారిపోనుంది. ఆపిల్ ల్యాబ్స్‌లో తయారవుతున్న ఆ మూడు మ్యాజికల్ గ్యాడ్జెట్స్ విషయానికొస్తే.. ముందుగా ఆపిల్ స్మార్ట్ గ్లాసెస్ గురించి మాట్లాడుకోవాలి. ఇవి చూడటానికి సాధారణ కళ్లద్దాల్లాగే కనిపిస్తాయి. కానీ వీటిలో ఏఐ కెమెరాలు, సెన్సర్లు ఉంటాయి. ఒకటి హై–రిజల్యూషన్ ఫొటోలు, వీడియోల కోసం పని చేస్తే.. రెండోది 'సిరి'కి పరిసరాలను వివరించే 'కంప్యూటర్ విజన్' కోసం సదా సిద్ధంగా ఉంటుంది. బిల్ట్–ఇన్ స్పీకర్లు, మైక్రోఫోన్ల సహాయంతో సిరిని నేరుగా ఆదేశించవచ్చు. దారిలో ఏదైనా ల్యాండ్‌మార్క్ గురించి అడిగినా, ఏదైనా వస్తువును చూపిస్తూ.. అది ఏంటని అడిగినా సిరి వెంటనే సమాధానం ఇస్తుంది. మరొకటి కెమెరాతో కూడిన ఎయిర్‌పాడ్స్. అవును, మీరు విన్నది నిజమే! ఆపిల్ ఎయిర్‌పాడ్స్‌లో ఇప్పుడు కెమెరాలను అమర్చబోతున్నారు. ఇవి మీ చుట్టూ ఉన్న దృశ్యాలను ఏఐ సహాయంతో విశ్లేషించి.. మీ చెవిలో సమాచారాన్ని అందిస్తాయి. మీరు ఎవరినైనా కలిసినప్పుడు వారి పేరు గుర్తులేకపోయినా.. ఈ ఎయిర్‌పాడ్స్ ఏఐ వారిని గుర్తించి మీ చెవిలో రహస్యంగా చెబుతాయి. ఇక యాపిల్ ఏఐ పెండెంట్ మరొకటి. యాపిల్ ఒక చిన్న పెండెంట్/ బ్రోచ్ వంటి పరికరాన్ని కూడా తయారు చేస్తున్నది. ఇది దాదాపు 'ఎయిర్ ట్యాగ్' సైజులో ఉంటుంది. ఇదో క్లిప్–ఆన్ గ్యాడ్జెట్‌లా పని చేస్తుంది.



దీన్ని దుస్తులకు క్లిప్ చేసుకోవచ్చు. మెడలో గొలుసులా వేసుకోవచ్చు. దీనికి డిస్‌ప్లే ఉండదు కానీ కెమెరా, మైక్రోఫోన్ ఉంటాయి. ఇది ఐఫోన్‌కు ఒక నిరంతర తోడుగా ఉంటూ, మీ చుట్టూ ఉన్న సందర్భాన్ని అర్థం చేసుకుని రియల్–టైమ్‌లో సిరి ద్వారా సాయం అందిస్తుంది. ఈ సరికొత్త ఏఐ గ్యాడ్జెట్స్ అన్నీ ఆపిల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానమై పని చేస్తాయి. దీంతో మన చేతిలో ఫోన్ ఉండాల్సిన అవసరం లేకుండానే.. కేవలం కళ్లజోడు లేదా ఎయిర్‌పాడ్స్‌తోనే మన డిజిటల్ పనులన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో ఇవి మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది.

## ఎండంటే భయమా?!



వేసవి వచ్చేసింది. మండే ఎండల్ని మోసుకొచ్చింది. అయితే, వేసవి అంటేనే కొందరైతే భయపడిపోతుంటారు. ఎండల్ని చూసి గజగజ వణికిపోతుంటారు. దీనినే వైద్య పరిభాషలో 'హీలియోఫోబియా'గా పిలుస్తారు. ఈ ఫోబియా ఉన్నవారు ఎండలోకి వెళ్లడానికి జంకుతారు. వీలైనంత వరకు చీకటి గదుల్లో, తలుపులు, కిటికీలు మూసి ఉన్నచోట ఉండటానికే ఇష్టపడతారు. సాధారణంగా ఎండలో తిరగడానికి ఇబ్బంది పడటం మామూలు విషయమే! కానీ అది ఫోబియాగా మారి.. రోజువారీ జీవితాన్ని ఇబ్బంది పెడుతుంటే మాత్రం ఆలోచించాల్సిందే! గతంలో ఎండలో తిరగడం వల్ల తీవ్రమైన వడదెబ్బకు గురికావడం, ఇబ్బంది పడటం లాంటి సంఘటనలు ఎదురైనవారిలో ఈ 'హీలియోఫోబియా' లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటివారు ఎండలోకి వెళ్తే తలనొప్పి, మైగ్రేన్, కళ్లు తిరుగుతాయని భయపడుతుంటారు. సూర్యరశ్మి వల్ల చర్మ క్యాన్సర్ వస్తుందని అనుకుంటారు. ఎండ వల్ల ముఖం మీద ముడతలు వస్తాయని, వయసు పైబడినట్లు కనిపిస్తామని అతిగా ఆందోళన చెందుతుంటారు. అందుకే, మధ్యాహ్నం బయటికి వెళ్లాలంటేనే జంకుతారు. వారి గుండెవేగం పెరుగుతుంది. చెమటలు పట్టడం, వణుకు రావడం కూడా గమనించవచ్చు. అయితే, ఇలా ఎండలోకి రాకుండా ఉండటం వల్ల పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా, సూర్యరశ్మి తగలకపోవడం వల్ల శరీరంలో విటమిన్ డి తగ్గి ఎముకలు బలహీనపడతాయి. ఎప్పుడూ ఇంట్లోనే ఉండటం వల్ల ఒంటరితనం, డిప్రెషన్ వంటి సమస్యలు చుట్టుముడతాయి. ఇక, ఈ సమస్యకు కౌన్సెలింగ్‌తో చెక్ పెట్టొచ్చని నిపుణులు అంటున్నారు. తక్కువ సమయంపాటు తక్కువ ఎండలో ఉండటం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. సన్‌స్క్రీన్ లోషన్లు, గొడుగులు, సన్ గ్లాసెస్ వాడటం ద్వారా భయాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చు. మనసులో ఇంకా ఏదైనా భయం ఉంటే.. సైకాలజిస్టును సంప్రదించడం మంచిది.



# మెగాస్టార్ కూతురిగా 'ఛాంపియన్' బ్యూటీ?




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న 'మెగా 158'లో కీలక కూతురు పాత్రపై చర్చలు ఊపందుకున్నాయి. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో సాగే ఈ కథలో ఆ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండనుందని సమాచారం. మూవీలో మెగాస్టార్ కూతురుగా ఛాంపియన్ బ్యూటీ అనస్వర రాజన్ దాదాపు ఖరారైనట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతుండగా, అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముంది. టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొల్పుతున్న ' మెగా 158 ' ప్రాజెక్ట్‌పై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో మరోసారి తెరకెక్కనుంది ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ఇందులో ప్రపంచ మాజీ సుందరి ఐశ్వర్యరాజ్ హీరోయిన్‌గా నటిస్తుందని వార్తలు రాగా ఆ తర్వాత నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి పేరు గట్టిగా వినిపించింది. కీలక పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కనిపించనున్నారని తెలుస్తోంది.





# వారణాసి సినిమాలో పవర్‌ఫుల్ రోల్‌లో ప్రకాష్‌రాజ్!

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న "వారణాసి" సినిమా రిలీజ్‌కు ఇంకా ఏడాదికి పైగానే సమయం ఉన్నా సినిమాపై జనాల్లో ఉన్న అంచనాలు అన్నీ ఇన్నీ కావు. కేవలం రెండు తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు.. యావత్ ఇండియా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురు చూస్తుంది. ఇక ఈ సినిమాలో వెర్సటైల్ యాక్టర్ ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన రోల్ గురించి ప్రకాష్ రాజ్ ఓపెన్ అయ్యాడు. ఈ సినిమాలో ప్రకాష్ రాజ్ పరమ శివ భక్తుడిగా కనిపించబోతున్నట్లు తెలిపారు . అంతేకాకుండా ఈ సినిమాలో ప్రకాష్ రాజ్, మహేష్ బాబు ఫాదర్‌గా కనిపించబోతున్నట్లు.. ఆయన రోల్ ఈ సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందని టాలీవుడ్ టాక్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. 2027ను టార్గెట్‌గా పెట్టుకుని రాజమౌళి ఈ సినిమాను పక్కా ప్లానింగ్‌తో తెరకెక్కిస్తున్నారు . ఈ సినిమాను జక్కన్న ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాడు.



# అద్భుతమైన ఛాయిస్ కోసం అనిల్ రావిపూడి వేట

మెగాస్టార్ చిరంజీవి గారికి బ్లాక్ బస్టర్ కానుక ఇచ్చి రెమ్యునరేషన్ తో పాటు రేంజ్ రోవర్ కారు గెలుచుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి నుంచి నెక్ట్స్ సినిమా అనౌన్స్ మెంట్ ఇంకా రాలేదు. 2027 సంక్రాంతికి విడుదల అనే విషయం మాత్రం కన్ఫర్మ్ అయ్యింది కానీ ఎవరెవరు ఉంటారనే దాని మీద ఇంకా క్లారిటీ రాలేదు. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించబోయే ఈ ఎంటర్ టైనర్ కు చాలా అంటే చాలా పొడవైన టైటిల్ ఫిక్స్ చేశారని సమాచారం. ఈ మూవీ లో ఇంకో హీరో ఉన్నాడు. సినీవర్గాల సమాచారం ప్రకారం అది బావమరిది క్యారెక్టర్ అని తెలుస్తోంది.తొలుత ఫహద్ ఫాసిల్ పేరు బలంగా వినిపించినప్పటికీ అనిల్ రావిపూడి మాత్రం కార్తీ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారట. మార్కెట్, ఇమేజ్ కోణంలో చూసుకుంటే తెలుగుతో పాటు తమిళంలో కూడా వర్కౌట్ చేసుకోవచ్చు కాబట్టి ఆ దిశగా ఫైనల్ చేసుకునేందుకు ప్రయత్నాడ



# అనుకున్నదాని కంటే వందరెట్లు బెటర్‌గా ఉంటుంది : సుహాస్

నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బల్‌వంత్‘ ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో సుహాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సారు వారు సూచించడంతో హేబల్‌వంత్‌గా మార్చాం. సినిమాలో నరేష్ క్యారెక్టర్ పేరు మార్చాం. చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని ఆలోచించే కుర్రాడు, నాన్న బిజినెస్‌ను టేకప్ చేయాలని అనుకుంటాడు. అప్పుడు అతనికి ఎదురైన పరిణామాలు ఏమిటి? నాన్న బిజినెస్ ఏమిటి? ఇలా సినిమా పూర్తి ఎంర్‌టైన్‌మెంట్‌గా, నా పాత్ర కూడా వినోదాత్మకంగా ఉంటుంది. నా కెరీర్‌లో సినిమా ఓకే కాగానే పూర్తిచేసి చాలా త్వరితగతిన విడుదల చేస్తున్న సినిమా 'హే బల్‌వంత్‘ సినిమా కూడా ఎంతో క్వాలిటీగా ఉంటుంది. కథ వినగానే నచ్చింది. ముఖ్యంగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్‌గా కనెక్ట్ అయ్యాను. సినిమా మేము అనుకున్నదాని కంటే వందరెట్లు బెటర్‌గా ఉంది అన్నారు.

# డీసెంట్ కలెక్షన్స్‌తో సైలెంట్ హిట్ 'నిలవే'

సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ హీరోయిన్ గా నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. గ్రూప్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా అందరి ఆదరణ అందుకుంది. ఈ సందర్భంగా రామానాయుడు స్టూడియోలో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో బైట్ ద్వారా స్పందిస్తూ బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచిందని చెబుతూ టీమ్‌ను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకులు వి సముద్ర మాట్లాడుతూ.. "ఈ వాలెంటైన్స్ డేకి విడుదలైన ఆరేడు చిత్రాల్లో 'నిలవే' సక్సెస్‌ఫుల్ టాక్ తెచ్చుకుంది. డీసెంట్ కలెక్షన్స్‌తో సైలెంట్ హిట్‌గా నిలిచింది. ఇందులోని హీరో హీరోయిన్ భవిష్యత్తులో కచ్చితంగా సూపర్ స్టార్స్ అవుతారు. డైరెక్టర్ సాయి కే వెన్నం గారితోపాటు టీమ్ అందరికీ నా శుభాభినందనలు తెలియజేస్తున్నా అన్నారు. మరో అతిథిగా హాజరైన జెమిని సురేష్ మాట్లాడుతూ.." చాలా రోజుల తర్వాత చాలా మంచి సినిమా చూశాననే ఫీలింగ్ మనసుకు కలిగింది అన్నారు. హీరో సౌమిత్ మాట్లాడుతూ .."కొత్త వాళ్లమైనా మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మూడేళ్ల కష్టమే ఈ సినిమా. మా 'నిలవే' మాకు 'బాహుబలి' లాంటిది అన్నారు. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ..మొదటి చిత్రంతోనే సక్సెస్ ఇచ్చిన తెలుగు ఆడియెన్స్‌కు థ్యాంక్స్. "అని చెప్పారు. దర్శకుడు సాయి కే వెన్నం మాట్లాడుతూ టీమ్ అందరి సపోర్ట్‌తోనే సక్సెస్ వచ్చింది"అని అన్నారు. నిర్మాత రాజ్ అల్లాడ భార్య మాధూరి మాట్లాడుతూ.."మా సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.





# మరకతమణి 2 ప్రారంభం

2017లో విడుదలై తన మ్యాజికల్ కాన్సెప్ట్, కామెడీతో ఫాంటసీ కామెడీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న చిత్రం మరకతమణి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ 'మరకతమణి 2‘ అధికారికంగా ప్రారంభమైంది. చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. హీరో కార్తీ క్లాప్ కొట్టగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు "కెమెరా రోలింగ్, యాక్షన్" అంటూ షూటింగ్ ప్రారంభించారు. యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీతో అనుబంధం వున్న అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డిసి మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్‌లపై సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ & కెవి దురై నిర్మిస్తున్న ఈ చిత్రానికి గత బ్లాక్ బస్టర్ 'మరకతమణి'కి దర్శకత్వం వహించిన ఎఆర్‌కె శరవణ్ దర్శకత్వం వహిస్తున్నారు.



# ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ చిత్రం 'సన్ ఆఫ్'

సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'సన్ ఆఫ్'. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత, నటుడు అశోక్ కుమార్, రామ సత్య నారాయణ రాజు, లైన్ వెంకట్, కన్నా రవి, రామకృష్ణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నిర్మాత, హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూలి .. 'సతీష్ గారు 'సన్ ఆఫ్' కథను నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఆయన చెప్పిన కథను విన్న తరువాత నా జీవితంలో జరిగినట్టుగానే ఉంది కదా అని అనిపించింది. యదార్థ ఘటనలతో ఈ మూవీని తెరకెక్కించారని కూడా చెప్పుకోవచ్చు. నాన్న మనకు క్రమ శిక్షణ, చదువు, సమయ పాలన వంటివి ఇస్తారు. డబ్బుని కాకుండా కష్టపడే తత్వాన్ని వారసత్వంగా ఇవ్వాలి. శోభా రాణి గారి వల్లే ఈ సినిమా ఈ స్థాయికి వచ్చింది. నేను ఐదు థియేటర్లు అడిగితే శోభమ్మ నాకు 300 థియేటర్లు ఇచ్చారు. ఫిబ్రవరి 27న మా సినిమా రాబోతోంది. తండ్రీకొడుకులు, ఫ్యామిలీ అంతా కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ .. 'శోభా రాణి గారు సినిమాల్ని అద్భుతంగా డిస్ట్రిబ్యూట్ చేస్తారు. 'సన్ ఆఫ్' చిత్రంలో సాయి సింహాద్రి గారు, మీరా గారు అద్భుతంగా ఉన్నారు. ఫిబ్రవరి 27న రాబోతోన్న ఈ మూవీని పెద్ద హిట్ చేయాలని ఆడియెన్స్‌ను కోరుకుంటున్నాను' అని అన్నారు.